స్కెచ్

# పరోపకారి దానయ్య

**స్వప్నం**

"ఇప్పుడే ఎనిమిదిగంటలుదాటింది ఈ చీకట్లో యెక్కడికండీ? ఉండండీ బిలియర్డ్సు ఆడుకుందాం ఓ అరగంట."

అరవై సంవత్సరముల పొట్టి పొడుగు కాని మనిషి. చామనచాయ. ఖద్దరుధోవతీ,చొక్కా, అంచుకట్టిన జరీఖండువా వల్లెవాటుగా-కండ్లకు సులోచనాలు- చేతిలో వెండితల బెత్తం, క్లబ్బుమెట్లు దిగుతుండగా, అప్పుడే మెట్లెక్కుతున్న నేనడిగాను.

"అబ్బాయ్, టైము లేదు- జగన్నాయకపురం చివరకుపోవాలి-నా చిన్ననాటి మిత్రుని కుమారుడు రామచంద్రం ఈ వూరొచ్చాడని గంటక్రితం తెలిసింది. తెలివితక్కువవాడు, నాకో కార్డు రాస్తే ఏంపోయిందని? అన్ని ఎరేంజిమెంట్లూ చేయనూ-మంచిరోజని సరాసరి క్రొత్తకొంపలో దిగుతున్నాడట. ఊరు క్రొత్తది- అతడూ, భార్యా మించి పైసహాయం లేదాయె. ఒక్కసారి పోయి వారి సంగతి విచారించి రావాలి."

"లేటయింది కాదూ? దగ్గరా, దాపా? ఇంతకీ మీకా యిల్లు తెలుసా?"

"తెలియదు. కాని ఫర్వాలేదు-"

"తెల్లారిపోకూడదూ? ఈచీకట్లో శ్రమపడడం దేనికని?"

"అలా కాదు. వాడూ, పెండ్లామూ సుఖంగా ఆయింట్లో ప్రవేశించారని తెలిసేవరకూ నాకు నిద్రపట్టదు. ఆపిల్ల చిన్నప్పుడు నాఅడ్డాల్లో పెరిగిందంటే నమ్మండి."

"రాత్రివేళ ఇల్లెట్లా కనుక్కుంటారు? వీధిదీపాలు కూడా వెలగకపోవచ్చు."

"ఓహో, అదా మీ భయం. క్షణంలో కనుక్కోవచ్చు. ఆప్రాంతంలో ప్రతి యింటివారినీ పలకరిస్తా. తెలియదన్న వారినల్లా. కంగారుపడకండి. హాయిగా పోయి నిద్రించండి. నాఅవస్థ నేపడ్తాను. ఇల్లే చివరకు కనిపెట్టలేనూ? శలవా మరి? మరోసారి ఆడుకుందాం."

* * *

తర్వాత మూడురోజుల వరకు మేమిద్దరం కలుసుకోలేదు. నాల్గవ రోజు సాయంత్రం ఆయనే నన్ను పలుకరించేరు క్లబ్బులో.

"ఏమయింది సార్?"

"ఓ పాతికిళ్లు శోధించేటప్పటికి అసలిల్లు దొరికింది మేడమీద నుండి రామచంద్రం, "తాతగారూ! పడుకున్నాం, రేపు మీ దర్శనం చేసుకుంటా" నన్నాడు. "అదేమిటయ్యా, ఇంకా పదిగంటలు కాలేదు- ఒక్కసారి పలుకరించి పోదామని ఇంతదూరం నడచివచ్చేను" అన్నాను. ఇద్దరూ క్రిందకు దిగివచ్చారు. తలుపు తీశారు. సామానంతా విరజల్లివుంది హాల్లో. ఆ పెట్టెలమీదనే కూర్చున్నాం. కుశలప్రశ్న వేశాను. ఆతగాడదే ఆవలింతలు. అమ్మాయి "తాతయ్యా, డ్రింకు కలపనా?" అని అడిగింది. "నీ కెందుకా శ్రమ తల్లీ గ్లాసులేపెట్టెలో ఉన్నాయో చెప్పు. నిముషంలో తయారుచేస్తా, పంచదార ఉండదేమోనని చిన్న పొట్లాం తెచ్చాను" అంటూ నాలుగయిదు పెట్టెలు శోధించి, గ్లాసులు వగైరా తీసి మూడు గ్లాసులు తయారుచేశాను. వాళ్లు మాట మంతీలేక ఉంటే నేనే సంభాషణ అంతా కానిచ్చాను. ఎక్కడో గడియారం పన్నెండు కొట్టింది.

"అబ్బా, అర్థరాత్రి అయింది. మీ రింటికి వెళ్లవద్దూ!" "రిక్షామీద పోతానోయ్, ఇన్నాళ్ళకు కలుసుకున్నాం. ప్రొద్దుటే వచ్చి అన్నీ సర్దిపెడతా, బెంగపడకండి. ఇంత కొంపలో ఎలా మసులుకుంటారు బాబూ!" అంటూ ఒంటిగంట ప్రాంతానికి వారినివదిలి భద్రముగా పడుకోమని హెచ్చరించి, ఇంటిమొగంపట్టాను.

"తర్వాత రెండు రోజులూ సామాన్లు సర్దటంలో వారికి సాయంచేస్తూ, బజారులో కావలసినవి తెచ్చి ఇస్తూ రేషను కార్డులు సంపాదించటంలో పాపం, వారికి సాయపడ్డాను. నా మిత్రులకు సాయపడటం కంటె నాకు పరమావధి ఏముంది కనుక?"

* * *

తర్వాత పది, పదిహేను రోజులవరకూ బాబయ్యగారు క్లబ్బులో తారసిల్లలేదు. ఏ ఊరో పోయి ఉంటారనుకొన్నాను.

మళ్లీ ఒక రోజు క్లబ్బు హాల్లో కలుసుకున్నాం.

"రామచంద్రంగారు కులాసానా?"

"క్లబ్బుకు రావడానికి తీరిక ఈ పన్నెండు రోజులూ చిక్కలేదు. అతగాడికి సుస్తీచేసింది. అమ్మాయి ఒక్కర్తా ఏం చెయ్యగలదు? అహర్నిశలూ వారిల్లు వదలడానికి వీల్లేకపోయింది.

"అమ్మాయిని పడుకోమని అతని మంచం వద్ద కూర్చుండేవాణ్ణి. ఒకప్పుడు జ్వరం తీవ్రతలో 'ఆ గాడిద వెళ్లిపోయాడా లేదా? ఎందుకు లోపలికి రానిస్తావ్? వెయ్యంలాగ మన కెక్కడ దాపురించాడు?' అంటూ ఏవో పేలుతూ ఉంటే : 'శాంతించు నాయనా శాంతించు. నేనే, దానయ్యను. చూడు బాబూ కళ్లు విప్పి! మీ దానయ్యను. అమ్మాయిని కాస్త విశ్రాంతి తీసుకోమని పంపాను. వేగమే కోలుకొంటావు!' అంటూ బుజ్జగించేవాణ్ణి.

"ఒకప్పుడు, 'ఆయన నిద్రపోతున్నాడు. ఉదయాన్నే రండి, తాతయ్యా - కంగారేం లేదు' అని అమ్మాయి నన్ను బ్రతిమిలాడేది. నేనుమాత్రం, 'హాల్లో కూర్చుంటా ఫర్వాలేదు. లేవగానే చెప్పు' అంటూ హాల్లో కుర్చీలో ఒరిగేవాణ్ణి. ఎలాగైతే నేం అతడు తేరుకున్నాడు.

"అబ్బాయీ, ఈ యిల్లు అచ్చిరాలేదు. రామారావు పేటలో చక్కని వాటా ఉంది. ఆ కోర్టుకూ దగ్గర. రేపే మారుదాం" అంటూ మెడ వంచి క్రొత్త బసలోకి మార్పించాను. మన క్లబ్బులో చేర్చాను. అయ్యో మరచా, పుల్లయ్యగారింటికి పోయివస్తానోసారి. ఆయన భార్యకు సుస్తీ చేసిందట" అంటూ వెళ్ళిపోయారు.

* * *

"దానయ్యగారెంత పరోపకారి! ఉపకారం చేయడంలో అలసటలేదు! అనుకుంటూ ఒక రోజు సాయంత్రం క్లబ్బు మెట్లు ఎక్కుతుండగా, దానయ్యగారు వెనకాలే వచ్చారు, ఆ క్లైముకి. ఇద్దరం వరండాలో నిలబడి పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నాం. "చూచావూ, రామచంద్రం నేనంటే పంచప్రాణాలూ పెడతాడట. మన బంట్రోతు చెప్పాడు. ప్రతి సాయింత్రం రాగానే, "దానయ్యగారు వచ్చారా"అని వాణ్ణి అడుగుతాడట. యోగ్యుడెప్పుడూ యోగ్యుడే!" అంటూ ఏవో కబుర్లు చెప్పి సోడాగదిలోకి వెళ్ళారు. నేనింకా వరండాలోనే తచ్చాడుతున్నాను.

ఇంతలో ఒక్క పలచని ముప్ఫై ఏండ్ల యువకుడు కంగారుగా మెట్లనెక్కివచ్చి బంట్రోతుతో, "దానయ్యగారున్నారటోయ్?" అని అడిగాడు.

బంట్రోతు - "చిత్తం, ఇప్పుడే లోపలికి వెళ్ళారండి!"

అంతే బెదురుకళ్ళతో వీధిలోకి ఆదే పరుగు తీశాడాతడు.

నేను బంట్రోతుతో - "ఎవరువారు?"

బంట్రోతు - "వారా, రామచంద్రంగారు. కొత్తగా క్లబ్బులో చేరారు బాబూ!"

(మూలం : లీకాక్)

---

బెట్టియా (బీహార్)లో ఒక సాధువు గత రెండు నెలలుగా నిరాహారదీక్ష బూనివున్నాడట. ఆతడివద్ద నెహ్రూ పండితుని చిత్రం ఒకటి వున్నదట. ఈ సాధువు ఎవరిదో ఒక తోటలో రెండు అరటిపండ్లు తీసుకున్నందువల్ల ఆ తోట యజమాని సాధువును కొట్టి పోలీసుస్టేషనుకు తీసికొనిపోగా, అప్పటినుంచి సాధువు నెహ్రూ పండితుడు స్వయంగా వచ్చి విచారించేవరకు నిరాహారదీక్ష బూనడానికి నిశ్చయించుకున్నాడు